# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో ప్రత్యేక వాహన తనిఖీలు**

**పత్రాలు లేని వాహనాలకు ఈచలాన్లు జారీ**



**పులివెందుల, జూలై 21 ప్రభాత వార్త :** వాహనదారుల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పులివెందుల ఎస్ఐ తిమోతి తెలిపారు. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ పర్యవేక్షణలో ఎస్ఐ తిమోతి తన సిబ్బందితో కలిసి పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు మోటారు వాహన చట్టం ప్రకారం ఈచలాన్లు జారీ చేశారు.అనంతరం ఎస్ఐ తిమోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు.ప్రజల భద్రత దృష్ట్యా పట్టణంలో ఇటువంటి ప్రత్యేక వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.


ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
బుధవారం 22 జూలై 2026


# సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్**



**రాయచోటి జులై 21 ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ఎస్.ఎన్.కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలతో ప్రత్యక్షంగా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, గ్రామాభివృద్ధికి సంబంధించిన సమస్య లను మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రతి వినతిని శ్రద్ధగా ఆలకించిన మంత్రి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

# రైతులకు నిత్యం 'భగీరథ' యత్నమే..

❖1000 అడుగులు బోరు వేసినా పడని నీళ్ళు

❖ఎటు చూసిన ఎండిన పంటలు, బోర్లే దర్శనం



డ్రిల్లింగ్ చేస్తున్న బోరుబండి

**మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :** తాగునీటి కోసం...బారులుతీరుతున్న బిందెలు...అక్కడక్కడ మహిళలు ఘర్షణలు.. తోపులాటలు...పోలీసులకు ఫిర్యాదులు. రైతులకు ఎటు చూసినా ఎండిన పంటలు. ఆవిరైపోయిన బోర్లే దర్శనం.. ఎండవేడిమికి.. వరుణుడు కరుణించక బోర్లన్నీ ఎండుమొఖం పట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో మదనపల్లెలో నీటికోసం పలు కాలనీల్లో ప్రజలుఅధికారులను కోరుతున్నారు. మదనపల్లె రూరల్ ప్రాంతాల్లో నీటి జాడ కోసం రైతులు నిత్యం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. నీళ్ళు ప్రాంతాలో ఎంతవరకు ఉంటే అంతలోతు వరకు బోరుబావి తవ్వినా నీళ్ళు పడని పరిస్థితి ఎదురవుతుంది. భూగర్భజలాలు రోజు రోజుకు అడుగంటుతుండడంతో నీళ్ళు వందల అడుగులు కొద్ది బోరు వేసినా పైకిరాని పరిస్థితి నెలకొంటోంది. గత ఆరు నెలలుగా రైతులు ఈ బోరు కోసం లక్షలాదిరుపాయలకు పైగా ఖర్చు చేశారంటే ఆశ్చర్యం కలుగుతుంది. అన్నమయ్యజిల్లా మదనపల్లె నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ పంటల సాగుకోసం వందల అడుగుల కొద్ది బోరును డ్రిల్లింగ్ చేస్తున్నారు. వెయ్యి నుంచి 1200 అడుగులు బోరు తవ్వినా నీళ్ళు పడడం లేదు. దీంతో రైతులు కోట్లాది రుపాయలు మట్టి పాలు అవుతోంది. మదనపల్లె, రామసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట, పిటిఎం, వాల్మీకిపురం, కలికిరి, నిమ్మనపల్లె మండలాల్లో గత ఆరు నెలలుగా వేల సంఖ్యలో రైతులు బోర్లు వేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య నెలకొనడంతో ప్రభుత్వ బోర్లుకూడా డ్రిల్లింగ్ చేశారు. తొలుత వెయ్యి అడుగులు బోరు వేసినా నీళ్ళు పడలేదు. ఆ తరువాత హై కెపాసిటి గల బోరు బండ్లతో 1200 అడుగులకు డ్రిల్లింగ్ చేసినా చుక్కనీరు కూడా బయటకు రాని పరిస్థితి నెలకొంది. గతంలో వంద అడుగులకే భూగర్భజలాలు దొరుకుతున్నా నేడు పాతాళంలోకి వెళ్ళినా నీళ్ళు పడకపోవడం జరుగుతోంది. 80శాతం గ్రామాల్లో మంచినీటి సమస్య, సాగునీటి సమస్య నెలకొంది. వర్షాలు పడకపోవడం వల్ల ఈ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు, నిండక పోయాయి. దీంతో భూగర్భజలాలు భారీగా అడుగంటాయి. ఈ ప్రాంతమంతా వర్షాలపై ఆధారపడుతారు. వర్షాలు భారీగా పడితేనే పంటలు సాగు అవుతాయి.గ్రామాల్లో మంచి నీటి సమస్య తీరుతుంది. వర్షాలు అనుకొన్న మేరకు పడకపోవడంతో ప్రతి ఏటా భూగర్భజలాలు క్రమేనా తగ్గుతూ ఉన్నాయి. కొందరు రైతులు బంగారు తాకట్టు పెట్టడం, ప్రైవేటుగా వడ్డీలకు అప్పులు చేసి బోరు వేయడం జరిగింది. నీళ్ళు పడకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. మామూలుగా వెయ్యి అడుగులకు బోరు వేయాలంటే కేసింగ్‌తో కలిసి రూ.3లక్షలు ఖర్చు అవుతుంది. ఈ బోరుబావికి హైపవర్ మోటార్, పంపు, కేబుల్, స్టాటర్ ఏర్పాటుచేయాల్సి ఉంది. దీనికోసం రూ.4లక్షలు ఖర్చు అవుతుంది. ఒకవేళ నీళ్ళు పడినా మరుసటి నెలకే తగ్గిపోయే పరిస్థితి ఉంది. వర్షాధారప్రాంతమైన పడమటి ప్రాంతంలో నదీజలాలు వస్తేకాని భూగర్భజలాలు పెరగని పరిస్థితి ఉంది. పుష్కలంగా నీరు పడిన బోరు కనీసం సంవత్సరం కూడా ఉపయోగపడకుండా అడుగంటిపోతున్నాయి. పశువులకు సైతం తాగునీరు కష్టం అవుతుంది. తాగునీరు దొరకక అటవీప్రాంతంలోని వన్యమృగాలు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇంతటి దుర్భిక్షను మునుపెన్నడూ చూడలేదని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి నదీజలాలను తీసుకువస్తే కాని భూగర్భజలాలు పైకి రాని పరిస్థితి ఎదురవుతుంది.



నీటి కోసం చాంతాడంత క్యూ కట్టిన ఖాళీ బిందెలు

# తెలుగు తమ్ముళ్లు ఇలాగైతే రాజంపేటలో స్థానిక ఎన్నికలు గెలవలేం.. సర్దుకుపోండి

బాబు దృష్టికి తీసుకు వెళతాం కోఆర్డినేటర్ దామచర్ల సత్య

పంచాయతీజగన్ రాజుతో భేటీ



రాజంపేట పార్లమెంట్ టిడిపి కోఆర్డినేటర్ దామచర్ల సత్యతో మాట్లాడుతున్న వెంకట నరసయ్య



విజయవాడలో అసమ్మతి వర్గం

**రాజంపేట, జూలై 21. ప్రభాతవార్తా** రాజంపేట నియోజకవర్గంలో అధికార పక్షంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న వర్గ పోరు క్లైమాక్స్‌కు చేరింది. వర్గ పోరు చిలికి చిలికి గాలివాన కాకముందే సద్దుమణిగేలా చేయాలని అధిష్టానం చొరవ తీసుకుంది. అసమ్మతి వర్గాన్ని రాజధానికి పిలిపించుకుంది. మంగళవారం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నేతలతో సమన్వయకర్త దామచర్ల సత్యతో పాటు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబులతో కలిసి సమావేశం అయ్యారు. అంతర్గత విభేదాలు విడనాడాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జగన్మోహన్ రాజుతో కలిసి పని చేయాలని సూచించారు. పార్టీ ముఖ్యమని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రి పార్టీ ఇంచార్జ్ నీ మార్చడం సాధ్యం కాదని చెప్పారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలాగైతే విజయం సాధించడం కష్టమని వివరించారు. తప్పులను ఎత్తి చూపితే కోవర్టులని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.సమావేశంలో ఒంటిమిట్ట మండలానికి చెందిన రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నర్సయ్య, పామూరు సుబ్రహ్మణ్యం ,మావిళ్ళ ఈశ్వరయ్య, లేబాక నరసయ్య, చప్పిడి రమేష్, చమర్తి సురేష్ రాజు,మందపల్లి శీను, మిరియాల జ్యోతి,మరికొందరు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. తమకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జోనల్ కోఆర్డినేటర్ సూచించారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి అన్ని విషయాలు తీసుకుపోతామని హామీ ఇచ్చారు. పార్టీకి నష్టం కలిగించేలా చేయవద్దని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలతో దామచర్ల సత్య మాట్లాడారు. అనంతరం అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజుతో దామచర్ల సత్య భేటీ అయ్యారు. పార్టీలో అందరినీ కలుపుకొని పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ పటిష్టత వైపు దిష్టి సారించాలని సూచించినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో అంతర్గత విభేదాలు పనికిరాని స్పష్టం చేసినట్టు తెలిసింది.

# ప్రభుత్వ భూములు కాపాడటంలో కిందిస్థాయి సిబ్బంది విఫలం

**తహసిల్దార్ శివకుమార్**



**పీలేరు, జూలై 21, ప్రభాతవార్త:** పీలేరు మండల పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడటంలో కిందిస్థాయి సిబ్బంది వీఆర్వోలు వీఆర్ఏలు విఫలమవుతున్నట్లు తమ దృష్టికి వస్తుందని ప్రభుత్వ భూములను కాపాడటంలో ఎందుకు నిరక్ష్యం వహిస్తున్నారు తెలియజేయాలని తహసిల్దార్ శివకుమార్ సిబ్బందిని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ అధికారులు వీఆర్వోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గుర్తు తెలియని వ్యక్తులు రికార్డులు లేని సంబంధిత అక్రమదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని విలాసాలకు విక్రయిస్తుండటంతో రెవెన్యూ అధికారులు వాటిని కాపాడటంలో విఫలమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సిగ్గుచేటని తహసిల్దార్ అన్నారు .అదేవిధంగా కొంతమంది సిబ్బంది తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటివి జరిగినట్లు నిరూపణ అయితే శాశ్వతంగా ఇంటికి పంపించడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించక తప్పదని తహసిల్దార్ హెచ్చరించారు. ఉన్నత అధికారులు ఆదేశాలను పాటిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి దేశానికే తలమానికమైన రెవెన్యూ వ్యవస్థను కాపాడటంలో రెవెన్యూ సిబ్బంది ముందు ఉండాలని ఆయన సూచించారు ప్రతి మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయేంతవరకు ఏ సమస్య వచ్చినా ఏ సర్టిఫికెట్ కావాలన్నా రెవెన్యూ వ్యవస్థ ముఖ్యమని అదే విధంగా భూమి పుట్టినప్పటి నుండి మధ్యలో క్రయ విక్రయాలు జరిగిన కూడా రెవెన్యూ వ్యవస్థ భాగంలోని అన్ని జరుగుతాయని అటువంటి వ్యవస్థను నిర్లక్ష్యం చేసి అక్రమదారుల కనుసన్నల్లో కొంతమంది వీఆర్వోలు పనిచేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అటువంటి వారిపై గట్టిగా ఉండడమే కాకుండా వారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు కూడా అందజేస్తామని తహసిల్దార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్ విఆర్వోలు సిద్దయ్య అజయ్ కుమార్, ఎల్లప్ప, ప్రసాద్‌తో పాటు శ్రీనివాసులు పలువురు విఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

# అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



**నందలూరు, జులై 21, ప్రభాతవార్త :** మహావిష్ణువు స్వరూపుడైన శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన అర్చక స్వాములు సునీల్ కుమార్ పాంచరాత్ర ఆగమ పండితుల బృందంతో కలశస్థాపన చేసి హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆగ్నేయ మూలలో వెలసి ఉన్న పుట్టకు పూజలు చేశారు. పంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా గురుదేవతలను లిఖించి ఆహ్వానించారు. పూజాది కార్యక్రమాల అనంతరం పుట్ట మన్ను సేకరించి అంకురార్పణ మండపంలో ఏర్పాటు చేసిన 12 పాలికల్లో నవధాన్యాలను చల్లి కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవవరులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎన్. రవి, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

ఉత్సవాల్లో భాగంగా 2వ రోజు బుధవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రికి యాలి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# ఘర్షణలో ఇద్దరికి గాయాలు



**మదనపల్లె క్రైం, జూలై 21 ప్రభాతవార్త.** మదనపల్లి మండలం కొత్త వారి పల్లి పంచాయతీ ఆర్ సి వడ్డేపల్లిలో జరిగిన ఘర్షణ లో ఇద్దరు గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త వారి పల్లి పంచాయతీకి చెందిన ఎస్. సురేష్ (25), అతని భార్య లక్ష్మీదేవి లపై దాడి జరిగింది. సాయికుమార్ ను, అదే గ్రామానికి చెందిన రాజశేఖర్, రాజ్ కుమార్, శివలు హేళనగా మాట్లాడటంతో వివాదం మొదలైంది. తనను అలా మాట్లాడొద్దు అంటూ సాయికుమార్ హెచ్చరించడంతో ఆగ్రహించిన రాజశేఖర్, రాజకుమార్, శివ, మల్లేశ్వరిలు ఒక్కసారిగా అతనిపై దాడికి యత్నించారు ఆ సమయంలో అడ్డుగా వచ్చిన అన్న సురేష్ వదిన లక్ష్మీదేవిలను చితకబాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సురేష్, లక్ష్మీదేవిలు చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చినుకు కరువాయే చేను బీడు బారే

**అదును దాటిపోయింది రైతన్న గుండె గుబేల్ మంది**



**రాయచోటి జులై 21 ప్రభాతవార్త** గత కొన్ని సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఈసారైనా వర్షాలు బాగా కురిసి పంటలు చేతికి అందుతాయని ఎంతో ఆశగా వాన కోసం ఎదురుచూసిన రైతన్నలకు ఈ సంవత్సరం కూడా ఎల్నినో తీవ్ర ప్రభావం చూపడంతో ఈ సంవత్సరం కూడా సరైన కాలంలో భూమిలో పడని వేరుశనగ కంది మొదలగు విత్తనాలు. బోర్ల కింద సాగు చేస్తున్నటువంటి రైతన్నలు కొద్దో గొప్పో వేసిన పంటలు వర్షం కురవకపోవడంతో సక్రమంగా మొలకెత్తక,కొన్ని మొలక దశలోనే ఎండిపోతున్నాయని రైతు సోద రులు వాపోతున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా రైతాంగం పై ఎల్నినో తీవ్ర ప్రభావం చూపడంతో ఖరీఫ్ సీజన్లో పచ్చగా పొలా లు కలకల లాడుతుంటే పచ్చని పొలాలను చూసి ఎంతో సంతోషంగా మురిసి పోయి ఈ సంవత్సరమైనా పంటలు బాగా పండిన పంట తమ చేతికి వచ్చి పిల్లా పాపలతో ఎంతో సంతోషంగా జీవించవచ్చు అనుకున్న తరుణంలో ఎల్నినో తీవ్ర ప్రభావం చూపడంతో వేరుశనగ, కంది,మొదలగు ఇతర పం టలు సాగు చేయాలనుకున్న రైతులకు ఆశాభంగం తప్పలేదని రైతు సోదరులు విచారం వ్యక్తం చేశారు. వేరుశనగ సాగుకు ఏరువాక సాగు అనుకూలమైన కార్తులన్నీ పోయినా కూడా వాన జాడ కానరాలేదని రైతన్నలు ఆవేదన చెందు తున్నారు. ఒకవేళ ప్రస్తుతం వర్షం కొద్దో గొప్పో కురిసిన సాగు చేసిన పంట దిగుబడి ఆశించినంత చేతికి రాక తమకు నష్టమే మిగులు తుందని వారు లబోదిబోమంటున్నారు. వర్షా భావ పరిస్థితుల వలన ఇప్పుడే కొందరు రైతులు వేరుశనగ విత్తనాలను అమ్ముకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వేరుశనగ కంది సాధారణ సాగు సుమారు 30 వేల హెక్టార్లు కాగా ప్రస్తుతం కేవలం సుమారు 2, 828 హెక్టార్లు మాత్రమే సాగైనట్లు తెలిపారు. సాగు చేసిన పంట కూడా చేతికి వస్తుందో రాదో అని రైతులు చింతిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 80!! లోటు వవర్షపాతం నమోదు కావడంతో వేరుశనగ, కంది సాగు చేయాలనుకున్న రైతులు నిరాశ చెందుతున్నారు. ఇలాంటి వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాసం కొరత ఏర్పడి పశువులకు కూడా మేత లేక పశువుల ను కళేబరాలకు తరలించే దుర్భర పరిస్థితి తమకు దాపరిస్తుం దేమోనని వారు ఆవేదన వెలబుచ్చారు. వర్షాభావ పరిస్థితులవలన ఇప్పటికే బోరు బావులలో నీరు సక్రమంగా రానందున పశువుల మేత తగినంత లేక తాము జీవనోపాధి కోల్పోతామని వారు లభోదిబో మంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మేము చేసిన అప్పులు ఎలా తీర్చాలి అని వారు ఆవేదన వ్యక్తపరిచారు. మేము బ్యాంకులలో తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి ప్రభుత్వం మమ్ములను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని అర్ధిస్తున్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**యువత భవిష్యత్తును కాపాడేందుకు సమష్టి కృషి అవసరం**

**ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**



మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**పులివెందుల, జూలై 21, ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాల నిర్మూలన కు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో రూపొందిం చిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్లను ఎంపీ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ, నేటి యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సి న అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.మత్తులో యువత.. ఆందోళనలో దేశ భవిత అనే నినాదంతో రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సి న అవసరం ఉందన్నారు. యువతను సన్మార్గంలో నడిపించేందు కు ప్రతి ఒక్కరూ కలిసికట్టు గా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఎంపీ పేర్కొన్నారు. ఈ దిశగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సర్వోత్తమ్ రెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు బాబురెడ్డి, కడాల లక్ష్మీనారాయణ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి : శివకుమార్

చౌడేపల్లి జూలై 21 ప్రభాతవార్త



పంటల అభిమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని పుంగనూరు వ్యవసాయ శాఖ సంచాలకులు శివకుమార్ కోరారు ఈ మేరకు స్థానికంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ జూలై 24 నుంచి ఆగస్టు 15 వరకు పంటల వారీగా గడువులు ఉన్నాయన్నారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పలు పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు నిర్ణీత గడువులోగా పంటల వారీగా నిర్దేశించిన ప్రీమియం చెల్లించి పంట బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేరుశనగ, టమోటా పంటలకు 2026 జూలై 24 వరకు, కంది, రాగి పంటలకు జూలై 31 వరకు, వరి పంటకు ఆగస్టు 15, 2026 వరకు రైతులు పంట బీమా కోసం ప్రీమియం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు పంటల వారీగా బీమా మరియు రైతు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు ఎలా ఉన్నాయన్నారు **వేరుశనగ:** ఎకరాకు బీమా మొత్తం రూ.28,000; రైతు ప్రీమియం రూ. 560. **టమోటా:** ఎకరాకు బీమా మొత్తం రూ.30,000; రైతు ప్రీమియం రూ.1,500, **కంది:** ఎకరాకు బీమా మొత్తం రూ.20,000; రైతు ప్రీమియం రూ.400, **రాగి:** ఎకరాకు బీమా మొత్తం రూ.17,000; రైతు ప్రీమియం రూ.170, **వరి:** ఎకరాకు బీమా మొత్తం రూ.42,000; రైతు ప్రీమియం రూ.840, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా పంట నష్టపోయే పరిస్థితుల్లో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంటల బీమా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన రైతులు గడువు ముగిసేలోపు పంట బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## సుండుపల్లిలో రెండవ రోజు పెన్ డౌన్

సుండుపల్లి, జూలై 21,ప్రభాతవార్త :



సుండుపల్లి లో దస్తావేజు రైటర్లు (దస్తావేజు లేఖరులు) చేపట్టిన నిరవధిక పెన్‌డౌన్ సమ్మె రెండవ రోజు కొనసాగించడం జరిగింది ఈ ఆందోళన జులై 20 నుండి ప్రారంభమై, జులై 31 వరకు 10 రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్ల సంఘం డిమాండ్ చేస్తోంది.పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) మోడల్‌లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను (ఆర్ఎస్ సిఎస్) ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.ఈ నూతన విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజుల తయారీ నమ్ముకున్న లక్షలాది కుటుంబాల ఉపాధి దెబ్బతింటుందని, తాము రోడ్డున పడే ప్రమాదం ఉందని లేఖరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ దుర్గలమ్మ కు ప్రత్యేక పూజలు దుర్గలమ్మకు 108 బిందెలతో జాలాభిషేకం

రామసముద్రం జూలై 21 ప్రభాతవార్త :



రామసముద్రం మండల కేంద్రంలోని బిసి కాలనీ వద్ద కొలువైన శ్రీ దుర్గలమ్మ కు మంగళవారం భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు అమ్మ వారి 108 బిందెలతో జలాభిసే ఖం నిర్వహించారు, ఆలయ పూజారి నాగరాజు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పలు రకాలు పుష్పాలు, వేపాకు, నిమ్మకాయ హారాలు చుట్టి భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాధాలు వితరణ చేశారు. భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గమ్మ అని మండలం లో ప్రజలు సుభిక్షంగా ఉండాలని వర్షాలు బాగా కురిసి ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని అమ్మ వారికి 108 బిందేలతో జలాభి షేకం చేసామని అన్నారు, బుధవారం ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటామన్నారు.

## పీలేరు విద్యార్థికి ట్రిబుల్ ఐటీ ఇడుపులపాయలో సీటు

పీలేరు, జూలై 21, ప్రభాతవార్త:



పీలేరు పట్టణ కోటపల్లె జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల విద్యార్థి మలకుంట వరుణ్ సాయి కి ట్రిబుల్ ఐటీ కడప జిల్లా ఇడుపులపాయలో సీట్ రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని, విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరుణ్ సాయి ప్రస్తుత జాండ్ల గ్రామ వాసి , వరుణ్ సాయి తండ్రి యం.వాసు ఓ మాజీ సైనిక ఉద్యోగి. సాధారణ నేపథ్యం నుంచి అసాధారణ సంస్థ ట్రిబుల్ ఐటీ ఇడుపులపాయలో సీట్ రావడం చాలా అదృష్టమని, వరుణ్ తల్లి తండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పశువైద్య ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్ రసూల్

రామసముద్రం, జులై 21, ప్రభాతవార్త:



రామసముద్రం మండల కేంద్రంలోని పశువైద్య ఆసుపత్రి ని మంగళవారం పశు వైద్య డిప్యూటీ రసూల్, అసిస్టెంట్ డైరెక్టర్ రోహిణి ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఆసుపత్రిలోని రిజిస్టర్ లను పరిశీలించారు, పశు వైద్యాధికారిని పావనితో మాట్లాడుతూ రైతులకు కావాల్సిన భూస, ఫీడు, కసువు విత్తనాలు, పశువులకు కావాల్సిన మందులు సకాలంలో రైతులకు అందజేయాలని ఆమెకు తెలియజేసారు, ఎళ్ల వేళలలో రైతులకు పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు, ఈ సమావేశంలో రసూల్, రోహిణి, పావని సిబ్బంది హాజరయ్యారు.

## కలికిరిలో 2వ రోజు దస్తావేజు లేఖరుల పెండౌన్ కార్యక్రమం విజయవంతం

కలికిరి, జులై 21, ప్రభాతవార్త:

కలికిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట జీవో 396 రద్దు చేయాలంటూ దస్తావేజు లేఖరులు నిర్వహిస్తున్న పెన్‌డౌన్ కార్యక్రమం 2వ రోజు విజయవంతమైంది. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 396ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈనెల 20 నుంచి 6వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు కక్షిదారుల సొంత వ్యవహారమైన దస్తావేజు తయారీ విధానాన్ని కూడా రిజిస్ట్రేషన్ కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెం.396 దస్తావేజు లేఖరుల జీవనోపాదికి తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తాము చేపడుతున్న ఆందోళనకు కక్షిదారులు సహకరించాలని వారు పేర్కొన్నారు. దస్తావేజు లేఖరులు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమానికి పలు పార్టీ నాయకులు మద్దతు పలికారు. దీంతో 2వ రోజు పెన్‌డౌన్ కార్యక్రమం విజయవంతమైంది.



## నాణ్యమైన విద్యుత్ సరఫరా, సోలార్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

### ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య

పీలేరు, జూలై 21 ప్రభాతవార్త

ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య మంగళవారం పీలేరు డివిజన్‌లో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పీలేరు మండలం జాండ్ల గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ సోలార్ ప్లాంట్‌ను సందర్శించి నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా పీలేరు డివిజన్ పరిధిలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రజలకు నిరంతరం నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు పగటిపూట మాత్రమే 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫెయిల్యూర్ అయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతులు చేసి రైతులకు సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించేలా డిజిటల్ చెల్లింపు విధానాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, వివిధ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు



సమాచారం చేరవేయాలని ఆదేశించారు. సమావేశంలో పీలేరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. చంద్రశేఖర్ రెడ్డి, ట్రాన్స్‌ఫార్మర్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్నమయ్య విజయభాస్కర్ కన్స్ట్రక్షన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు రెడ్డి పీలేరు ఆపరేషన్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అమీర్ భాషా , శివయ్య, పీలేరు ఆపరేషన్ డివిజన్‌కు చెందిన సెక్షన్ ఆఫీసర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: యూటీఎఫ్ డిమాండ్

మదనపల్లెక్రైం, జూలై 21 ప్రభాతవార్త.



నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ నిరక్ష య వైఖరిని ఖండిస్తూ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యుటిఎఫ్ ఆధ్వ ర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. చంద్రశేఖర్, ప్రధాన కార్య దర్శి కె. హేమలత మాట్లాడుతూ.. నీట్ లీకేజీ కారణంగా పలువురు విద్యార్థు లు ఆత్మహత్యలు చేసుకున్నా కేంద్ర మంత్రి స్పందించకపోవడం దారుణ మన్నారు. ఎన్టీఏ ను రద్దు చేసి, నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకే అప్పగించాలని కోరారు. అలాగే, విద్యారంగ పరిరక్షణ కోసం నిరాహారదీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టును ఖండించారు. 2010 కంటే ముందు నియమితులైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇచ్చేలా విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1)కి సవరణలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రవిప్రకాష్, వెంకటరమణ, విజయ

## నీలకంఠ రావు పేట గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల పర్యటన

రామాపురం, జూలై 21, ప్రభాతవార్త:



మండలంలోని నీలకంఠరావుపేట గ్రామంలో విద్యుత్ సమస్యలపై మంగళవారం ఏఈ శ్రీనివాసులు రెడ్డి సిబ్బంది కలిసి పర్యటించారు. విద్యుత్ సమస్యపై ఆరాధిశారు అనంతరం గోపగుడిపల్లి గ్రామం కాంపల్లి లో విద్యుత్ సమస్య ఉందని గ్రామ ప్రజలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన ఫోన్ ద్వారా ఏఈ శ్రీనివాస్ రెడ్డి కి గ్రామంలో విద్యుత్తు సమస్య ఉందని చెప్పడంతో వెంటనే ఆ గ్రామానికి ఏఈ సిబ్బంది వెళ్లి గ్రామంలో వెలుతురు ఉండే విధంగా వీధులు సమస్య ఉన్న చోట తిరిగి సమస్య లేకుండా పరిష్కరించారు నీలకంఠరావుపేట గ్రామానికి త్వరలో కరెంటు స్తంభాలు వైర్లు వీధి దీపాలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు నియాజ్ వెంకటరమణ ఇషాక్ గ్రామ కార్యకర్తలు. విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బద్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపై విచారణ జరపాలి

బద్వేలు, జూలై 21, ప్రభాతవార్త



బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో వివాదాస్పద భూములు, డీకేటీ స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తూ దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న బద్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై జిల్లా స్థాయి విచారణ చేపట్టాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో చంద్రమోహన్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివాదాస్పద భూములను రెవెన్యూ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, దళారుల ద్వారా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అర్హులైన బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని, భూ వివాదాలు పెరుగుతున్నాయని అన్నారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో భూముల ధరలు పెరగడంతో కొందరు ఆక్రమణదారులు అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, కే. బాబు, సంజీవరాయుడు, విజయరావు, రామరాజు, గంటా మహబూబ్ బాషా, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కరాజుపల్లి డంపింగ్ యార్డ్‌ను తనిఖీ చేసిన ఎంపిడిఓ

తంబళ్లపల్లె జూలై 21 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం కుక్క రాజు పల్లి పంచాయతీ డంపింగ్ యార్డ్ ను ఎంపీడీవో ఉషారాణి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఉదయం ఆమె డిప్యూటీ ఎంపీడీవో ఎంబి ప్రసాద్ తో కలిసి కుక్క రాజు పల్లి గ్రామంలో పర్యటించి పారిశుధ్యం నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం డంపింగ్ యార్డ్ ను పరిశీలించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువు గా తయారు చేయడానికి గ్రీన్ అంబాసిడర్లు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీలో పర్యటిస్తున్న స్వచ్ఛరథం నిర్వహణపై ఆరా తీసి స్థానిక ప్రజలకు పనికిరాని వస్తు సామాగ్రిని అప్పగించి అందుకు సరిపడా వస్తువులు తీసుకువెళ్లాలని సూచించారు. పంచాయితీ కార్యదర్శి ఎప్పటికప్పుడు పారిశుధ్యం, తాగునీరు, వైద్యం పై ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలి

### ఏడిఏ జయరాణి

రామాపురం జూలై 21 ప్రభాతవార్త :



ఎలినిఒ ప్రభావం వలన తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి అన్నారు. మండలంలోని కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ పరిధిలోని సూర్యనారాయణపురం గువ్వల చెరువు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల నుండి నష్టాల నుండి పంటలను కాపాడుకోవడానికి ప్రధానమంత్రి పసల బీమా పథకం ప్రీమియం కట్టుకోవాలని అన్నారు. పంటల బీమాను వరి పంటకు ఎకరాకు రూ 80 రూపాయలు ఆగస్టు 15 లోపల బీమా చెల్లించుకోవాలన్నారు .కంది పంటకు ఎకరాకు రూ 44 రూపాయలు చొప్పున రైతులు జులై 31వ తేదీ లోపు చెల్లించాలని తెలిపారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద వేరుశనగ పంటకు ఎకరాకు రూ 560 రూపాయలు ఈనెల 24వ తేదీ లోపల చెల్లించాలని రైతులకు సూచించారు. ఆధార్ కార్డు . పట్టాదార పాస్ బుక్.1బి. బ్యాంక్ అకౌంటు పంటల సాగు ధ్రువీకరణ పత్రంతో మీ సేవ కేంద్రాల్లో సంప్రదించి పంటల బీమాను నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై నాగమణి సిబ్బంది హరిత పకృతి వ్యవసాయ సిబ్బంది. రైతులు సుధాకర్. ధనుం జయ. రాజనాయక్ శివయ్య.మహిళా రైతులు పాల్గొన్నారు.

## నేడు సర్ కార్యక్రమంపై సమావేశం

రామాపురం జూలై 21 ప్రభాతవార్త :

రామాపురం మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు బిఎల్ఓ లకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా తాసిల్దార్ వెంకటేసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న బిఎల్వోలుకు సర్ కార్యక్రమంపై సమావేశం ఉంటుందని అన్నారు. తప్పకుండా బిఎల్వోలు హాజరుకావాలని వారు అన్నారు.

## తల్లి, కుమారుడి అదృశ్యంపై కేసు నమోదు

### ఆచూకీ కోసం పోలీసుల ముమ్మర గాలింపు

గాలివీడు. జూలై 21. ప్రభాత వార్త.

గాలివీడుకు చెందిన ఈశ్వరమ్మ (40), ఆమె కుమారుడు రంజిత్ కుమార్ రెడ్డి (2) జూలై 14న అదృశ్యమయ్యారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు వివరాల్లోకి వెళితే గాలివీడు టౌన్, నూలివీడు రోడ్డులోని తమ ఇంటి నుండి 14 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బయటకు వెళ్లినారని అనంతరం తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు.కుటుంబ సభ్యులైన రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం గాలివీడు పోలీసులు మిస్సింగ్ కేసునమోదు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వరలక్ష్మి కోసం వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వీరి ఆచూకీ తెలిసిన వారు వెంటనే గాలివీడు ఎస్ఐ (9121100556), లక్కిరెడ్డిపల్లి సర్కిల్ సీఐ (9121100554) లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగలరనీ తెలిపారు.

## నిత్యాన్నదానానికి రూ.20,150 విరాళం

పులివెందుల,జూలై 21, ప్రభాతవార్త



కడప నగర కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెకు చెందిన పుట్లూరు సుబ్బరాయుడు, పుట్లూరు లక్ష్మీదేవి దంపతులు ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి ఆలయ నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.20,150 విరాళంగా అందజేశారు.తమ మనవడు పుట్లూరు దేవాన్ష్ హరిహరణ్ పేరు మీద మంగళవారం ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు అందజేసి రసీదు పొందారు. ప్రతి సంవత్సరం తమ మనవడి పుట్టినరోజు సందర్భంగా గండి క్షేత్రానికి వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించాలని వారు నిర్ణయించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, అధికారులు దాత కుటుంబ సభ్యులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పంటలకు బీమా చేయించుకోవాలి

వీఎన్ పల్లి,జూలై 21, ప్రభాతవార్త:

రైతులు ఖరీఫ్ లో సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కొమ్మద్ది గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు చేయించుకొని ఆ పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా పడ్డే సూచన ఉన్నందున తక్కువ సమయంలో చేతికొచ్చే పంటలైన కొర్ర, పెసర, మినుము, కంది పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి రైతు ఏపీఏఐఎంఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గంగాదేవి , జెడ్బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి ప్రతిభావంతుల విద్యార్థులకు మంచూరు సూర్యనారాయణ రెడ్డి సత్కారం

బద్వేలు అర్బన్, జూలై 21, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సత్కరించడం అభినందనీయమని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఉమ్మడి కడప డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు.రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్, మెరిట్ సర్టిఫికేట్‌తో పాటు రూ.20 వేల నగదు బహుమతి అందజేయడాన్ని ఆయన స్వాగతించారు. ఈ సందర్భంగా బద్వేలు పట్టణానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అక్కి నందిని (466/500 – రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్), పి. అభినయ్‌జీ (587/600), బి. జ్యోతిక (588/600)లను మంచూరు సూర్యనారాయణ రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అదనంగా ఒక్కో విద్యార్థికి రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు వారిలో పోటీ స్ఫూర్తిని పెంపొందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, వారి విజయాలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షి ంచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలి యజేస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని కోరారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్ భవనానికి స్థల సేకరణ

కురబలకోట, జూలై 21, ప్రభాతవార్త:



కురబలకోట మండలం అంగళ్లు గ్రామంలోని కమతంపల్లి అంగన్వాడి సెంటరుకు మంగళవారం అధికారులు స్థల సేకరణ నిర్వహించారు. మొదట ఎంపీడీవో, ఐసిడిఎస్ అధికారులు, టిడిపి నాయకులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అంగన్వాడి సెంటర్ కూటమి ప్రభుత్వం 15 లక్షలు నిధులు మంజూరు చేసింది. అందుకు తగిన స్థలం పరిశీలనలో జాప్యం కావడంతో పక్క గ్రామానికి తరలించాలని యోజనలో అధికారులు పడ్డారు.ఈ నేపథ్యంలో మహిళలు గర్భిణీలు గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు నిరసన వ్యక్తపరిచారు. అంగళ్ల గ్రామ నివాసి, మండల టిడిపి యువ నాయకుడు సీతారాం బాబు. దృష్టికి తెచ్చారు. ఆయన జోక్యం చేసుకోని సంబంధిత అధికారులతో చర్చించి ఇక్కడే కొనసాగేలా కృషి చేశారు.అంగన్వాడి సెంటర్ కు అవసరమగు స్థలాన్ని ఎంపీడీవో గంగయ్య తంబలపల్లి సిడిపిఓ సుజాత ,సూపర్వైజర్ నాగలక్ష్మి మ్మ ,మండల టిడిపి యువ నాయకులు చిట్టి సీతారాంబాబులు కలసి కమతంపల్లి ఎక్స్టెన్షన్ రోడ్లో స్థల పరిశీలన నిర్వహించారు. దీంతో గ్రామస్తులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## పెద్దేరు ప్రాజెక్టును సందర్శించిన హైడ్రాలజీ అధికారులు

తంబళ్లపల్లె, జూలై 21, ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలం జుంజురపెంట పంచాయతీ పరిధిలోని పెద్దేరు ప్రాజెక్టును మంగళవారం హైడ్రాలజీ అధికారుల బృందం విస్తృతంగా పర్యటించారు. ఉదయం పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్ ఆధ్వర్యంలో హైడ్రాలజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్, డిఈ సత్యవతి, ప్రాజెక్ట్ ఇరిగేషన్ డిఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ సతీష్ లు ప్రాజెక్ట్ లో ఏర్పాటు చేసిన హైడ్రాలిక్ సిస్టమ్స్, గేట్లు, లాక్ లు మరియు సీసీ కెమెరాలు ఏర్పాటు పై ఆరా తీశారు. ప్రాజెక్టు కింది భాగంలోని గేట్లు పనితీరు పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని రెయిన్ గేజ్ పరిశీలించి పనితీరుపై చైర్మన్ శివకుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు పెద్దేరు ప్రాజెక్టు పరిధిలోని హైడ్రాలిక్ సిస్టం పనితీరు పై ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులకు పాలు సలహాలు సూచనలు చేశారు. హైడ్రాలిక్ సిస్టం పనితీరు పై ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. వారి వెంట పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు కమిటీ మెంబర్లు, లస్కర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కలికిరి పూర్వ విద్యార్థి కర్నూలు ఎస్పీ హనుమంతు విద్యార్థులకు సూచనలు



పీలేరు జూలై 21 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని కలికిరి ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి శ్రీ అమ్మిటి హనుమంతు మా పాఠశాలకు విచ్చేశారు. వారు మా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, చదువుపట్ల వారికి ఉండవలసిన నిబద్ధతను, తల్లిదండ్రులు, గురువుల పట్ల ఉండవలసిన భక్తి ప్రపత్తులను గూర్చి వివరించారు. అన్నింటికంటే ముఖ్యంగా వారు అలవరచుకోవాల్సిన సామాజిక బాధ్యతల గురించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు.తాను బాల్యంలో ఎదుర్కొన్న కష్టాల గురించి,తర్వాత తన చదువు ద్వారా సాధించిన విజయాల గురించి క్షుణ్ణంగా వివరించారు.వారి ప్రసంగం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా, ప్రేరణాత్మకంగా ఉన్నదని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు కొనియాడారు. తన గుర్తుగా ఒక మొక్కను పాఠశాలకు బహూకరించారు. చివరిగా ఉపాధ్యాయులు ఎస్పీని పూల హారంతో, శాలువాతో సన్మానించారు.

## పాత గొడవల కారణంగా గాయపరిచిన వారిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం, జూలై 21, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు ఆర్ట్స్ కాలేజీలో నివాసం ఉంటున్న ఖాదర్ బాషా కుమారుడు షేక్ అష్రఫ్(19)పై దాడి చేసిన కేసులో అష్రఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్ అష్రఫ్ తన స్నేహితుడు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండడంతో ఈనెల 20వ తేదీ వెళ్లి చూసి తిరిగి ఇంటికి వస్తుండగా ముక్తియార్ ఆయిల్ మిల్ వద్దకు రాగానే ఇద్దరు ముద్దాయిలు బాబాఫకృద్దీన్ అలియాస్ గుండు, మహ్మద్‌లు పాత గొడవలు మనసులో ఉంచుకొని అష్రఫ్‌తో గొడవపడి రాయితో కొట్టి గాయపరిచారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు

## పీలేరు ఆర్డీఓగా కె. విజయలక్ష్మి నియామకం

పీలేరు జూలై 21 ప్రభాతవార్త:



పీలేరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీఓ)గా కె. విజయలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ అధికారుల బదిలీలు, నియామకాలలో భాగంగా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పీలేరు ఆర్డీఓ స్థానం ఖాళీగా ఉండడంతో ప్రస్తుతం చిత్తూరు జిల్లా ఎన్నికల విభాగంలో ఎలక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. విజయలక్ష్మి ని పీలేరు రెవెన్యూ డివిజన్ పూర్తిస్థాయి అధికారిణిగా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయలక్ష్మి త్వరలోనే పీలేరు ఆర్డిఓ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. రెవెన్యూ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# 24 గంటలలోపే బాలుడి ఆచూకీ

### సాంకేతిక పరిజ్ఞానం ద్వారా బాలుడు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు

గాలివీడు. జూలై 21. ప్రభాతవార్త.

అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లికి చెందిన చంద్రగిరి గణేష్ సోమవారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గాలివీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తును అత్యంత వేగంగా ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా గాలివీడు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి బాలుడి కదలికలను గుర్తించారు. ఈ క్రమంలో గణేష్ గాలివీడు నుంచి తిరుమలకు వెళ్లినట్లు నిర్ధారించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై అక్కడికి చేరుకుని బాలుడిని సురక్షి తంగా స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ, పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం శ్రద్ధ వహించాలని, ఏవైనా సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.కేసు నమోదైన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా స్పందించి, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను సమర్థంగా వినియోగించి కేవలం 24 గంటల్లోనే బాలుడి ఆచూకీని గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు. సమయస్ఫూర్తి, నిబద్ధత, ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న గాలివీడు ఎస్ ఐ నరసింహ రెడ్డి ని మండల



## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

వేంపల్లె జూలై 21 ప్రభాతవార్త



నీట్ పరిక్ష పత్రాల లీకేజీ, పరిక్ష రద్దుకు సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి సూచించారు. గతంలో ఆయా మంత్రిత్వ శాఖల్లో జరిగిన ప్రమాదాలు, అవినీతి ఆరోపణలు, వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ అనేక మంది కేంద్ర మంత్రులు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 1956లో లాల్ బహదూర్ శాస్త్రి, 1958లో టిటి కృష్ణమాచారి, 1962లో వికె కృష్ణ మినన్, 1987లో విపి సింగ్, 2008లో శివరాజ్ పాటిల్, 2013లో పవన్ బన్సాల్, అశ్విని కుమార్, 2021లో హర్షవర్ధన్ లు తమ పదవులపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారన్నారు. అదేతరహా నీట్ పరిక్ష లీకేజీ, పరిక్ష రద్దుకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, లేదంటే ప్రధానమంత్రి మోడీ, ధర్మేంద్ర ప్రధాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

# కూటమి పాలనలో ప్రజలపై పెరుగుతున్న దాడులు

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని వైకాపానియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో టిడిపి నాయకులు మహిళలపై పాల్పడుతున్న దౌర్జన్యాలు, దాడులకు నిరసనగా పట్టణంలోని గొల్లపల్లె వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం వైకాపా నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. మహిళలతో కలసి నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్బంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ మహిళలకు కూటమి పాలనలో రక్షణ లేకుండా పోతోందన్నారు. గుంటూరులో మహిళలు వివస్థను చేసి టిడిపి నాయకులు వేధించిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్థిస్తూ, అమానుష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సి న ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. మహిళలు భయాందోళనల మధ్య జీవించాల్సి న పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనూషరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మెన్‌లు షమీం అస్లాం, మనూజా, మహిళా నాయకురాలు రేవతి, పద్మజ, శారదారెడ్డి, నాగమణి, వినూతబాయి, మంజుల, డిష్‌కుమారి, నక్కా రమాదేవి, రాష్ట్ర ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.రెడ్డి, ఇర్ఫాన్, భయ్యారెడ్డి, కరీముల్లా, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## జీఓనెంబర్ 396ను రద్దు చేయాలి

రెండవ రోజు కొనసాగిన నిరసనలు




నిరసనలు వ్యక్తం చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

జిఓనెంబర్ 396ను రద్దు చేసి దస్తావేజుల లేఖరులకు న్యాయం చేయాలంటూ సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలు రెండవ రోజు మంగళవారం కొనసాగాయి. సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద దస్తావేజులు లేఖరులు, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంప్‌వెండర్లు, రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 31వరకు పెన్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్బంగా దస్తావేజుల లేఖరులు మాట్లాడుతూ దస్తావేజులు తయారీ విధానాన్ని రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగించే జీఓనెంబర్ 396 నుంచి వెంటనే ఉపసంహరించుకొని, తమ జీవనోపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సబ్‌రిజిష్టర్ గురుస్వామికి వినతిపత్రం అందజేశారు. ప్లాకార్డులు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజుల లేఖరుల రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఖంగేరి నందా, అధ్యక్షులు రంగు గుణశేఖర్, గౌరవ అధ్యక్షులు రంగు రాజేంద్ర, ఉప కార్యదర్శి జి.రెడ్డప్ప, కోశాధికారి మహమ్మద్ లవానిబాబు, నాయకులు సాయి శేఖర్‌రెడ్డి, రెడ్డిశివరామ్, నవీన్, రెడ్డప్ప, మురళి, హాజీ, శంకర్ పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ఒంటిమిట్ట జూలై 21 ప్రభాతవార్త

మండలం రాచపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారిని భావన ఆదేశాల మేరకు సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బరాయుడు వైద్య సిబ్బందితో మంగళవారం డెంగ్యూ వ్యాధి పట్ల తీసుకోవాల్సి న జాగ్రత్తలను సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల .సుబ్బరాయుడు విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డెంగ్యూ వ్యాధి నివారణ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. తగిన విధంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. చెక్ ,క్లీన్, కవర్ విధానాలను అనుసరించాలని డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఏ విధంగా ఉంటాయో వివరించారు. ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో దోమతెరలు ఉపయోగించాలన్నారు. గృహ వాతావరణం పరిశుభ్రతగా ఉంచుకోవాలన్నారు. మురికి కాలువల వద్ద దోమలు వాలకుండా క్రిమిసంహారక మందులు ఉపయోగించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత క్రమంగా పాటించాలన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సిబ్బంది సలహాల మేరకు రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయినట్లయితే డాక్టర్ సలహాలు తీసుకొని వైద్యం చేయించుకుని మందులు వాడాలన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా 14 సంవత్సరాల బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకోవాలని పబ్లిక్ హెల్త్ నర్స్ వెంకటసుబ్బమ్మ తెలియజేశారు. కరోనా బారిన పడకుండా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని తరచుగా సానిటైజర్ ఉపయోగించి చేతులు శుభ్రంగా కడుక్కోవాలని దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు అడ్డుగా చేతి రుమాలు ఉపయోగించాలని సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుకోవాలని వేడివేడిగా ఉన్న భోజనం భుజించాలని స్త్రీ సూపర్వైజర్ సుజాత తెలిపారు. చివరగా విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జమాల్ రెడ్డి,అధ్యాపక, విద్యార్థిని బృందం తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## 396 జీవోను రద్దు చేయాలి



ప్రొద్దుటూరు జూలై 21 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజులేఖర్ల జీవనోపాధికి ప్రమాదం కలిగించే 396 జీవోను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం 396 జీవో కు వ్యతిరేకంగా స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాలయం ఎదురుగా దస్తావేజులేఖర్ల నిరసన కార్యక్రమంకి ఆయన మద్దతు ప్రకటించారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో అమలు చేస్తున్న జి.ఓ. నెం.396 వల్ల స్టాంప్ రైటర్లు, డాక్యుమెంట్ రైటర్లు, వెండర్ల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న వారిని పక్కనబెట్టి ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి సంబంధిత వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. స్టాంప్ రైటర్ల పెన్‌డౌన్ కారణంగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్న ఆయన, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. జులై 31లోపు జి.ఓ.ను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీక్షలో స్టాంప్ రైటర్స్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయండి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ ఆటోఅండ్ మోటార్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. మంగళవారం బెంగుళూరు బస్టాండు ఆటో స్టాండ్ వద్ద మహాసభల ఫోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది ఆటో, ట్యాక్సీ, క్యాబ్, గూడ్స్ వాహన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరుగుతున్న డీజల్, పెట్రోల్,సిఎన్‌జి దరలు, ఫిటినెస్, పర్మిట్ పన్నుల భారంగా వాహన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వాహన కార్మికులు, యజమానులు, ఏఐటియుసి అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు విశాఖపట్టణంలో ఆగస్టు 20, 21వ తేదీల్లో జరిగే ఈ మహాసభలకు విచ్చేసి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మస్తాన్, గంగులప్ప, ఖాదర్, బాష, మహబూబ్‌బాషా, ఖాదర్‌ఖాన్, నరసింహులు, సికింధర్‌లు పాల్గొన్నారు.

## ఎస్ఆర్2 డ్యామ్ నుంచి సాగునీటి విడుదల



మైదుకూరు, జూలై 21, ప్రభాతవార్త:

రైతులకు సకాలంలో సాగునీరు అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మైదుకూరు మండలం లెక్కలవారిపల్లె సమీపంలోని ఎస్ఆర్ 2 డ్యామ్ నుంచి మిట్టమానుపల్లె చెరువుకు సాగునీటిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీటి పంపిణీ పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నీటి నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగునీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాగునీటి విడుదలతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ, పంటలకు సకాలంలో నీరు అందనున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## నలుగురు పేకాట రాయుళ్లు అరెస్టు



ముద్దనూరు, జూలై 21 ప్రభాతవార్త:

ముద్దనూరు పట్టణంలోని జమ్మలమడుగు వెళ్లే రహదారిలోని జగనన్న కాలనీలో దేనేపల్లె ఆరవేటి పల్లె గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ నాగేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై మధుసూదన్‌రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.14,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను ముద్దనూరు పోలీసు స్టేషన్‌కు తరలించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సీఐ నాగేశ్‌బాబు తెలిపారు. జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి సంఘటనలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సూచించారు.

## మహిళకు రక్తదానం..

ప్రొద్దుటూరు అర్బన్, జూలై 21, ప్రభాతవార్త



ఒక మహిళకు రక్తము తక్కువగా ఉండి అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నందున వారు ధార్మిక్ రక్తదాన సేవాసమితి వారిని సంప్రదించగా వెంటనే స్పందించిన ధార్మిక్ రక్తదాన సేవా సమితి రక్తదాత చంటి డెకరేషన్స్ ఏ.జానయ్య ను సంప్రదించగా మహిళకు ఏ పాజిటివ్ రక్తాన్ని, స్థానిక సురక్ష బ్లడ్ బ్యాంక్ నందు ఇచ్చారు .ఆపద సమయంలో స్పందించి, రక్తదానం చేసిన చంటి డెకరేషన్స్ ఏ.జానయ్యను ధార్మిక్ రక్తదాన సేవాసమితి వారు కృతజ్ఞతలు తెలిపాఎబ్ రు. ధార్మిక్ రక్తదాన సేవాసమితి వారు, సహాయం చేసేందుకు, చేయించేందుకు ,ఎప్పుడు ముందుంటామని, రక్తం అవసరం ఉన్నవారు రక్తదానం చేయదలచిన వారు ధార్మిక్ రక్తదాన సేవాసమితి 905992715 నంబర్ ను సంప్రదించాలని ఛైర్మన్ గంజి సురేష్ కుమార్ తెలిపారు.

## నీట్ ప్రశ్నాపత్రాల లీకేజిలో కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్




రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, జులై 21 ప్రభాతవార్త :

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజి వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కదిరిరోడ్డు నందు సిపిఎం ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రం లీకేజి, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జిని ఖండిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు 500పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజి కారణంగా దేశంలో 27మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత భాదాకరమన్నారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలు, మోసాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖామంత్రి ధరేంద్ర ప్రదాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీ చేయించడం అమానుషమన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, కేంద్ర ప్రభుత్వ విద్యావిదానాలకు వ్యతిరేకంగా నిరాహరదీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త సోనమ్‌వాంగ్‌చుక్‌తో కనీసం చర్చలు జరపకుండా అక్రమంగా నిర్బందించడం భాదాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, రామక్రిష్ణ, నారాయణ, రాజు, క్రిష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓపై విచారణ

సిద్దవటం జులై 21 ప్రభాతవార్త



సిద్ధవటం ఎంపీడీఓ ఫణి రాజకుమారిపై మంగళవారం డిప్యూటీ సీఈఓ రామ చంద్ర విచారణ చేపట్టారు. గతంలో మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ కుమారుడు చంద్ర ఎంపీడీఓపై ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షురాలి కార్యాలయానికి సంబంధించిన విషయంలో, మండల అభివృద్ధి పనుల విషయంలో ఎంపీడీఓపై ఆయన జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ ఫిర్యాదు మేరకు డిప్యూటీ సీఈఓ రామచంద్ర సిద్ధవటంలోని ఎంపీడీఓ కార్యాలయానికి విచ్చేసి విచారణ చేపట్టారు. ఎంపీడీఓ ను, మండల అధ్యక్షురాలి ప్రతినిధి చంద్ర ను విడివిడిగా విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. అనంతరం డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ విచారణలో తేలిన నిజాలపై నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్ సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్డీఓ వెంకట సుబ్బయ్య, సీఈఓ కార్యాలయ భాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నాగభూషణం కుటుంబ సభ్యులకు పరామర్శ

కడప కార్పొరేషన్ జూలై 21 ప్రభాతవార్త:



బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు తండ్రి గోవిందు నాగభూషణం కాలం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం ఎస్ బి. అంజద్ భాష మంగళవారం కడప విజయదుర్గ కాలనీలోని గోవింద నాగరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోవింద నాగభూషణం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజద్ మాట్లాడుతూ గోవింద నాగభూషణం మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంజి, షఫీ, సుబ్బరాయుడు, బీసీ నాయకులు కళ్యా సుధాకర్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా వరి సాగు

ప్రొద్దుటూరు క్రైం, జూలై 21, ప్రభాతవార్త:

వర్షాలు పడలేదు. పడతాయో లేదో తెలియదు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని కుందూ నది పరివాహక ప్రాంతంలో వరి నాట్లకు రైతులు సాగు ముందుకు వెళ్తున్నారు. ఏ లీలియో కారణంగా వర్షాలు పడవని నష్టపోతారని రైతులకు వ్యవసాయాధికారులు చెబుతున్నా వినకుండా బోర్ల కింద సాగు చేసుకుంటున్నామనని రైతులు చెబుతున్నారు. ప్రొద్దుటూరు చాపాడు మండల పరిధిలోని దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాలు రాకపోగా నదులు ఎండిపోతే భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో కూడా నీరు రాని పరిస్థితి ఏర్పడితే రైతుల పరిస్థితి ఏంటి అనేది అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయినా రైతులు వరి పంట లేకుండా మెట్ట పైర్లు వేసుకుంటే కలుపు నివారణకు చాలా ఇబ్బంది పడతామంటున్నారు. కలుపు నివారణకు రకరకాల మందులు వచ్చాయని టెక్నాలజీ ఉపయోగించుకొని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు వేసుకోవాలని వరి పంట వల్ల ఖర్చులు విపరీతంగా పోరిగిపోయి లాభాలు రావడం లేదని మెట్లపైర్ల ద్వారానే మంచి లాభాలు వస్తున్నాయని కొంత మంది రైతులు సలహాలు ఇస్తున్నా వరి పంటకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎలాగైనా ప్రజా ప్రతినిధులు కేసీ కెనాల్ ద్వారా నీటిని అందించి రైతులను కాపాడతారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వరి పంట లేకుండా ఒట్టిపైర్లు వేసుకునేందుకు శ్రద్ధ చూపాలని అవగాహన కల్పించాల్సి న అవసరం ఎంతైనా ఉంది.



## ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి



దువ్వూరు, జూలై 21, ప్రభాతవార్త:

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దభాకరాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పసుపు, మొక్కజొన్న, జొన్న, మినుము వంటి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారని అందుకు అనుగుణంగానే పంటలు సాగు చేసుకోవాలన్నారు. కేసీ కాలువకు ఇప్పుడే నీరు వచ్చే పరిస్థితి లేదని అందువల్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆరుతడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా, డిఏపి కావలసిన రైతులు యాప్ ద్వారా నమోదు చేసుకొని సంబంధిత దుకాణం వద్దకు వెళ్లి తెచ్చుకోవాలన్నారు. నీరు వచ్చే అవకాశం లేనందున వరి నారు మల్లు కూడా సాగు చేయవద్దని సూచించారు. గొట్టపు బావుల కింద విద్యుత్ కొరత కూడా ఏర్పడే అవకాశం ఉంటుందని అందువల్ల వరి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయకుండా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మనోజ్, రైతులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ తో విద్యార్థికి గాయాలు

మదనపల్లెక్రైం, జూలై 21 ప్రభాతవార్త.



స్కూల్ నుంచి ఇంటికి వస్తుండగా దారి మధ్యలో కరెంట్ షాక్ కు గురై ఓ విద్యార్థి తీవ్రంగా గాయ పడ్డాడు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మదనపల్లె మండలంలోని చీకలబైలు గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. మండలం లోని చీకలబైలు గ్రామం, జోలపేటకు చెందిన సురేంద్ర, సుమిత్ర దంపతుల కుమారుడు అభిలాష్(11) సోమవారం సాయంత్రం పక్క గ్రామంలో ఉన్న స్కూల్ నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కనే కిందే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తగలడంతో కరెంట్ షాక్ కొట్టి గాయ పడ్డాడు. స్థానికులు గమనించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు వెంటనే ఘటనా స్థలం వద్దకు వచ్చి కుమారున్ని చికిత్సల కోసం హుటా హుటిన స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఇనుపకంచే ఏర్పాటు చేయాలని ఏఈ, లైన్ మ్యాన్కు పలు మార్లు మొరపెట్టుకున్నా వేయలేదని ఆరోపణలు ఉన్నాయి.

## ప్రశ్నిస్తే లాఠీఛార్జిలు, దేశద్రోహ కేసులా?

వేంపల్లె జూలై 21 ప్రభాతవార్త




నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నిస్తే లాఠీఛార్జీలు, దేశద్రోహ కేసులా అని సిపిఐ పులివెందుల ప్రాంతీయ కార్యదర్శి వెంకట రాములు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీతో మానసిక స్థైర్యం కోల్పోయి 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ఐటి)ని రద్దు చేసి పారదర్శకమైన పరీక్ష వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. గత రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, ప్రజా సంఘాలు, దేశ యువత శాంతియుతంగా నిరసన చేపట్టినప్పటికీ కేంద్రం స్పందించక పోవడం అత్యంత దురదృష్టకర విషయమన్నారు. అంతేకాకుండా వీరిపై విచక్షణ రహితంగా కొట్టించడం, లాఠీఛార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. వీరు చట్ట పరిరక్షకులా లేదా రౌడిమూకలా లేదా ఆర్ఎస్ఎస్ కార్యకర్తల వీటన్నింటిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ దోపిడీ నుంచి విద్యను కాపాడి, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించేలా విద్యా విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు చాంద్ బాషా, జకరయ్య, అంజనప్ప, షరీఫ్, బాదుల్లా, అలి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరులను రోడ్లపాలు చేసే కుట్ర తగదు



కడప కార్పొరేషన్ జూలై 21 ప్రభాతవార్త:

దస్తావేజు లేఖరులను రోడ్ల పాలు చేయాలనే కుట్రతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జీవో నెం. 396ను తెరపైకి తీసుకురావడం దారుణమని బీ.సీ. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మచ్చయ్యగారి నాగమల్లేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నబీకోటలోని బీ.సీ. ఐక్యవేదిక కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖను ప్రయివేటీకరణ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 396 జీవోను బూచిగా చూపి రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖను ప్రయివేటీకరణ చేసి తద్వారా రిజిస్ట్రేషన్ శాఖ సేవలతో పాటుగా కక్షిదారుల స్వంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానాన్ని రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగించేలా కుట్రకు తెరతీయడం బాధాకరమన్నారు. దస్తావేజు లేఖరులు ఈనెల 20 నుండి తలపెట్టిన న్యాయమైన సమ్మెకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నదన్నారు. ప్రభుత్వం స్పందించి 396 జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీ.సీ. ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ గోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.హరినాథ్, కోశాధికారి అంజనేయులు పాల్గొన్నారు.

## అంగళ్లు వద్ద రోడ్డు ప్రమాదం: ట్రాక్టర్ ఢీకొని దంపతులకు గాయాలు

మదనపల్లెక్రైం, జూలై 21 ప్రభాతవార్త.

ట్రాక్టర్ ఢీకొనడంతో జర్నలిస్టు దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది. ఘటన పై పోలీసుల కథనం ప్రకారం.. మదనపల్లెకు చెందిన జర్నలిస్టు చిన్న యుగంధర్ తన భార్య సరస్వతిని ద్విచక్ర వాహనంపై ఓ ఇంజనీరింగ్ కళాశాల నుంచి మదనపల్లెకు తీసుకొస్తున్నారు. మార్గ మధ్యంలో అంగళ్లు బైపాస్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న యుగంధర్‌కు రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. భార్య సరస్వతి కూడా గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఓ కారులో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి ప్రథమ చికిత్స అందించారు. యుగంధర్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి కి రెఫర్ చేశారు. ప్రస్తుతం చిన్న యుగంధర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కురబలకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సిజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం, జూలై 21 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా పెట్టుకుంటే ఆరోగ్య వంతులుగా ఉంటారని, అలాగే కాచ్చి చల్లార్చిన నీరు ప్రతి ఒక్కరు తీసుకోవాలని, జలుబు దగ్గు ఉన్న పేషెంట్లు ఆరోగ్యం పట్ల అలసత్యం చేయవద్దని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుని సంప్రదించి చికిత్సలు తీసుకోవాలని తెలిపారు. కోవిడ్ పై ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు.

# బాలికల విద్య, సంక్షేమ పథకాలపై అవగాహన : సిడిపిఓ

**ముద్దనూరు, జూలై 21 ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ముద్దనూరు సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర వసతి గృహం నంబరు-1లో మంగళవారం బాలికల విద్య, మహిళా-శిశు సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి ఓబుళమ్మ మాట్లాడుతూ, అత్యవసర సహాయ సేవల దూరవాణి సంఖ్యల వినియోగం, ప్రధానమంత్రి మాతృ వందన పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పర్యవేక్షకురాలు భారతి మాట్లాడుతూ, తల్లి గర్భంలోనే ఆడ శిశువులపై వివక్ష చూపడం, లింగ నిర్ధారణ ఆధారంగా గర్భస్రావాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలికల అభ్యున్నతికి విద్యే బలమైన ఆయుధమని పేర్కొంటూ, బాలల సంరక్షణకు సంబంధించిన అత్యవసర సహాయ సేవలు, బాలల హక్కుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యవేక్షకురాలు లక్ష్మి మాట్లాడుతూ, మిషన్ వాత్సల్య పథకంలోని ప్రాయోజకత్వ పథకం ద్వారా అర్హులైన చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక, విద్యా సహాయాలను వివరించి, అవసరమైన వారు ఈ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై పూర్తి దృష్టి సారించి విద్యాభ్యాసం కొనసాగిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్వాడీ కార్యకర్త ప్రభావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాల్లో ఉచిత పుస్తకాలు పంపిణీ

**కడప కార్పొరేషన్ జూలై 21 ప్రభాతవార్త:**
మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి వరకు అనే పుస్తకాన్ని శర్మ రచించారు. మంగళవారం ఉమ్మడి వైయస్సార్ కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో అన్ని గ్రంథాలయాలకు ఉచితముగా పుస్తకాలను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రరీ పవన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# గోసేవే జగతికి మేలు.. - శ్రీశ్రీ ప్రభు మహరాజ్



**ప్రొద్దుటూరు క్రైం, జూలై 21, ప్రభాతవార్త:**
జగతిని రక్షించాలంటే అదొక్కటే మార్గమని, అలాగే ప్రస్తుత మానవాళిని రైతులను ప్రజలను రక్షించాలంటే ప్రతి గ్రామంలో యజ్ఞాలు నిర్వహించాలని దీనికి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని సమస్త సాంప్రదాయ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ప్రభు మహరాజు అన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని ఉప్పరపల్లె గోశాల క్షేత్రానికి నారాయణ మహరాజు ఆరాధన మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గో సేవ చేసి హారతి ఇచ్చి పండ్లు, ఆకు కూరలు గోవులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోసేవ మానవాళి రక్షణకు కవచంగా నిలుస్తుందన్నారు. ప్రతి ఇంట్లో ఒక గోవు ఉండాలని ఇంటి ముందర కల్లాపి ముగ్గు వేసుకొని పంట పెట్టినప్పుడు పురుగుమందులు ఆశించకుండా ప్రకృతి ద్వారా లభించే గోమూత్రం, గోపేడ, గోపాలు, గోవు దారాలకించే మజ్జిగ ద్వారా పంటలకు క్రిమిసంహారకంగా మారి పంటలు రక్షించే మానవాళికి మంచి ఆహారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏలినావో కారణంగా ప్రభావం వల్ల దేశ వ్యాప్తంగా వర్షాలు పడవని వాతావరణ శాఖ చెబుతున్న కారణంగా ప్రతి ఊరిలో దేశవ్యాప్తంగా యజ్ఞ క్రతువులు నిర్వహించాలని దీనివల్ల కచ్చితంగా వర్షాలు పడతాయని వాతావరణంలో పెనుమార్పులు వస్తాయని పురాతన కాలం నుంచి యజ్ఞాలు నిర్వహిస్తూనే ఉన్నారని ప్రస్తుత సమాజంలో యజ్ఞాలు నిర్వహించడం లేదన్నారు. గోవులను రక్షించడం ద్వారా కలియుగం పోయి కృతయుగం వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. గోవు ద్వారా లాభపడాలని లాభాపేక్ష కోరుకోకుండా సేవ ద్వారా గోవును రక్షిస్తే అది మానవాళిని రక్షిస్తుందన్నారు.

# తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి



**వేంపల్లె జూలై 21 ప్రభాతవార్త**
తల్లిదండ్రుల కలలను నెరవేర్చుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ జీవితంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను పాఠశాలకు చెందిన విద్యార్థినిలు జూటూరు రజిత, కె.షైని రోషిణి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. 2025, 26 విద్యా సంవత్సరానికి పదోతరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలు, రూ.20 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఇఓ షంషుద్దీన్, తదితర అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థినిలు ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి అవార్డులను పొందడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా పాఠశాల డైరెక్టర్ చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిలను అభినందించారు.

# మున్సిపాలిటిలో ముంచుకొస్తున్న నీటి ఎద్దడి

## ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు.... శివారు ప్రాంతాల్లో పదిరోజులకు రాని నీళ్ళు

**మదనపల్లె, జూలై 21 ప్రభాతవార్త :**
జిల్లాలోనే సెలక్షన్‌గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న మదనపల్లె పట్టణంలో నీటి ఎద్దడి రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. పట్టణ శివారు ప్రాంతాల్లో పదిరోజులకు ఒక్క పర్యాయం కూడా తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించి రూ.600నుంచి 700ల చొప్పున నీటిని కొనుగోలు చేసుకొంటున్నారు. వేసవిని తలపించేలా పట్టణంలో నీటి ఎద్దడి ఉండడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాటిలో పరిధిలో ఉన్న బోర్లలో నీటిశాతం తగ్గిపోవడం వల్లే నీటి ఎద్దడి నెలకొందంటూ అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రజల నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేసి సమస్యను పరిష్కరిస్తామంటూ అధికారులు చెబుతున్నారు. గత నెలరోజులుగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంత ప్రజలు స్థానిక ఎమ్మెల్యే షాజహన్‌బాషాను కూడా ఆశ్రయించి విన్నవించుకోవడం జరిగింది. అంతేకాకుండా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిరసనలు తెలిపి కలెక్టర్‌కు కూడా నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించడం జరిగింది. ఇక మున్సిపల్ కార్యాలయంలో కూడా మహిళలు నీటిసమస్యపై నిరసనలు తెలిపా సంబంధిత అధికారులకు విన్నవించడం జరిగింది. వర్షాభావ పరిస్థితుల వల్ల పట్టణంలో నీటి సమస్య రోజు రోజుకు జఠిలం అవుతోంది. ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాల్లోనే నీటిసమస్య జఠిలంగా ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. పట్టణంతో పాటు టిట్కో ఇండ్ల నివాస ప్రాంతాల్లో కూడా నీటి ఎద్దడి జఠిలంగా ఉన్నట్లు ఆ ప్రాంత ప్రజలు జిల్లా కలెక్టర్‌కు విన్నవించడం జరిగింది. నీటిసమస్యపై మున్సిపల్ కమిషనర్ ప్రమీళను విచారించగా ప్రజలు ఎవరూ నీటిసమస్యతో ఇబ్బంది పడకుండా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అదనపు బోర్లు డ్రిల్లింగ్ చేయడం జరుగుతుందని, నీటి సరఫరాకు టెండర్ల ద్వారా ట్యాంకర్లను కూడా పిలవడం జరిగిందన్నారు. గత నాలుగు రోజులుగా గుత్తేదారుల ద్వారా ట్యాంకర్ల నుంచి సంపులకు నీటిసరఫరా చేయడం జరుగుతోందన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**పులివెందుల, జూలై 21 , ప్రభాతవార్త :**
ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం పులివెందుల పట్టణంలోని తన స్వగృహంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబర్ 396 కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజులేఖరుల జీవనోపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని పులివెందుల దస్తావేజులేఖ రులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందన రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని వారు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. జీవో నంబర్ 396ను రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దస్తావేజు లేఖరుల ఉపాధిని కాపాడాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి దస్తావేజులేఖరులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి, డ్రైవర్లుగా ప్రైవేట్ వ్యక్తులను నియమించడం ద్వారా సంస్థను ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల ఆర్టీసీ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు న్యాయం చేయాలని ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కచ్చితంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# ఎరువులు, విత్తనాల దుకాణాలపై వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**బద్వేలు అర్బన్, జూలై 21, ప్రభాతవార్త**
మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో దుకాణాల వద్ద స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్‌లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఏఓ అరుణ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఎరువులు, విత్తనాలు అమ్మితే డీలర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు కూడా ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా రైతులు యూరియాను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు.

# సికిల్ సెల్ అనీమియా, టి.బి. అవగాహనా సదస్సు

**పీలేరు జూలై 21 ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ఎస్. టి. కాలనీలో మెడిక్కుర్తి పి. హెచ్. సి వైద్యులు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా,టి. బి, స్టాప్ డయేరియా, డెంగ్యీ వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి వారి ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ. 104సేవలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.హెచ్.ఈ.ఓ. మహమ్మద్ రఫీ మాట్లాడుచు సికెల్ సెల్ అనీమియా రక్తపరీక్షలు ఎస్. టి. కాలనీలోని 40సంవత్సరాలలోపు ప్రజలు అందరు చేయించుకోవాలని అన్నారు. సికిల్ సెల్ రక్తహీనత పై 2047 సంవత్సరానికి సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్ లో భాగంగా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. సికెల్ సెల్ అనీమియా వ్యాధి వారస్వతంగా వచ్చే ఎర్ర రక్తకణముల వ్యాధి. ఈ జబ్బు తల్లిదండ్రుల నుండి జన్యుపరంగా పిల్లలకు వస్తుంది. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి లక్షణాలు రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన వళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడం లో కష్టం, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ వైఫల్యం, పెరుగుదల సమస్యలు. ఈ వ్యాధి నిర్ధారణ కొరకు ప్రతీ ఆరోగ్య కార్యకర్త దగ్గర పరీక్ష కిట్స్ అందుబాటులో ఉన్నాయి. ఒక్క చుక్క రక్తం తో పరీక్ష చేసుకోవచ్చు. సున్నా నుండి 40సంవత్సరాల లోపు గిరిజనులు పరీక్షలు చేసుకోవాలి. వ్యాధి నిర్ధారణ ఐతే హైడ్రాక్సీ యూరియా మాత్రలు తో పాటు ఫోలిక్ ఆసిడ్ మాత్రలు కూడా ఇవ్వడం జరుగుతుంది. సచివాలయం లో ఉన్న ఆరోగ్య కార్యకర్తల దగ్గర కిట్ అందుబాటులో ఉన్నాయని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధి యొక్క స్థాయి ని బట్టి ఎముక మజ్జ మార్చబడుతుంది అన్నారు. టి. బి. ముక్త్ భారత్ లో యువత భాగస్వామ్యం అవసరం ఎంతైనా ఉందన్నారు. టి. బి. లక్షణాలు గల వారికి నిర్ధారణ పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అన్నారు.ప్రజల చేత నినాదాలు చేస్తూ ఫ్లేకార్డ్స్ ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు గిరిజమ్మ ఎమ్. ఎల్.హెచ్.పి షహీరాబాను ఏ. ఎన్. ఎమ్ రమాదేవి, ఆశాకార్యకర్తలు అరుణ, ధనలక్ష్మి, 104 సిబ్బంది పాల్గొన్నారు.



# మై భారత్ నేషన్ ఛాలెంజ్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వెంకట లోకేష్‌కు అభినందన



**వీరబల్లి జూలై 21 ప్రభాతవార్త:**
యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ పోర్టల్ ద్వారా దేశ నిర్మాణానికి మరియు స్వావలంబనకు దోహదపడేలా రోజువారీ చర్యలను ప్రోత్సహించే ఒక దేశవ్యాప్త డిజిటల్ ప్రచారమే నేషన్ ఫస్ట్ ఛాలెంజ్ అని వీఆర్డీఎస్ సురేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్డికేఆర్ డిగ్రీ కళాశాలలో మై భారత్ నేషన్ ఫస్ట్ ఛాలెంజ్ లో ఆంధ్రప్రదేశ్ లో మొదటి స్థానంలో నిలిచిన వెంకట లోకేష్ కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతు వెంకట లోకేష్ వీరబల్లి ఎస్డికేఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతు ఈ పోటీలకు సిద్ధమయ్యాడని ఈ పోటీలకు జాతీయ స్థాయిలో పది లక్షలు మంది పాల్గొన్నారని జాతీయ స్థాయిలో ఐదవ స్థానం ఆంధ్రప్రదేశ్ లో ప్రథమ స్థానాన్ని సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. అనంతరం వెంకట లోకేష్ ను వీఆర్డీఎస్ సురేంద్రారెడ్డి జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ శ్రీనివాసులు రెడ్డి,మెప్మా ఆఫీసర్ అబ్బాస్ అలీ ఖాన్ కళాశాల సిబ్బంది వెంకటరమణ, గీత, అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంటల బీమా గడువు జూలై 24 వరకు పొడిగింపు

**పులివెందుల, జూలై 21 ప్రభాతవార్త :**
రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల ని మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి సూచించారు. మంగళవారం ఇ.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన నోటిఫైడ్ పంటలకు రైతులు నిర్ణీత గడువులోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. పంటల బీమాను దిగుబడి ఆధారిత బీమా పథకం ,వాతావరణ ఆధారిత బీమా పథకంగా విభజించినట్లు తెలిపారు.దిగుబడి ఆధారిత పంటల బీమా వరి, జొన్న, కంది, మినుము, పసుపు, ఉల్లి పంటలకు జూలై 31వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎకరానికి వరికి రూ.85, జొన్నకు రూ.38, కందికి రూ.36, మినుముకు రూ.38, ఉల్లికి రూ.91, పసుపుకు రూ.182 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ ప్రీమియంను ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ పేరుతో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.వాతావరణ ఆధారిత పంటల బీమా వేరుశనగ, పత్తి, అరటి, టమోటా, చీని, నిమ్మ పంటలకు జూలై 24వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఎకరానికి వేరుశనగకు రూ.562, పత్తికి రూ.2,023, అరటికి రూ.3,061, చీని, నిమ్మకు రూ.2,782 చొప్పున ప్రీమియం చెల్లించాల న్నారు. ఈ పంటలకు ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరుతో ప్రీమియం చెల్లించాలని సూచించారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతుల బీమా ప్రీమియంను సంబంధిత బ్యాంకులే బీమా సంస్థలకు జమ చేస్తాయని తెలిపారు. రుణాలు పొందని రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట ధ్రువీకరణ పత్రం తీసుకుని, భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకంతో మీసేవ కేంద్రంలో పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు తాము సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవడంతో పాటు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఫసల్ బీమా పథకం ఈక్రాప్ నమోదుతో అనుసంధానమై ఉన్నందున, ఈక్రాప్ నమోదు లేకపోతే పంటల బీమా వర్తించదని స్పష్టం చేశారు.

**జీవామృతం తయారీపై అవగాహన**

క్షేత్ర సందర్శనలో భాగంగా ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ యామిని లతారెడ్డి అరటి తోటలో మొక్కలకు అవసరమైన పోషకాల కోసం జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు ప్రదర్శన ద్వారా వివరించారు. 200 లీటర్ల డ్రమ్ములో 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల పేడ, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, ఒక గుప్పెడు నల్లబెల్లం, పుట్టమట్టిని కలిపి ఉదయం, సాయంత్రం కర్రతో కలియబెట్టాలని తెలిపారు. వారం రోజుల అనంతరం జీవామృతాన్ని పొలానికి పారించవచ్చని, అలాగే 10 శాతం నీటిలో కలిపి పిచికారీ చేయవచ్చని చెప్పారు. అన్ని రకాల పంటలకు అవసరమైన పోషకాలను అందించేం దుకు జీవామృతం ఉప యోగపడుతుందని వివరిం చారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ యామిని లతారెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి

# పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి విరాళం



**మైదుకూరు, జూలై 21, ప్రభాతవార్త:**
తాను చదివిన పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని సంకల్పించిన పూర్వ విద్యార్థి మామిళ్లపల్లి శశికుమార్ తన ఉదారతను చాటుకున్నారు. మైదుకూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) - ఎస్. మైదుకూరు మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం మొత్తం రూ.1,00,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రెండు పాఠశాలలకు రూ.50,000 చొప్పున విరాళం అందించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ డీఈవో నాగ మునిరెడ్డి మాట్లాడుతూ, పాఠశాల పట్ల కృతజ్ఞతాభావంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేసిన శశికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆవుల శ్రీనివాసులు, దరిసి శ్రీనివాసులు, ఎ. రాముడు, పద్మజ, బాల గంగాధర్, సురేంద్ర నాయక్, ఆనందరావు, మాధవిలత, స్వర్ణలత, ధనలక్ష్మి తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

# రైతులకు సకాలంలో నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం

**బ్రహ్మంగారిమఠం, జూలై 21 ప్రభాతవార్త**



రైతులకు సకాలంలో సాగునీరు అందించి వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో బ్రహ్మసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కెనాల్‌కు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జ్, జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డితో కలిసి సాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా నీటి నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలని రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి పంపిణీ చేపట్టాలని ఎస్సీ మల్లికార్జునకు సూచించారు. బ్రహ్మం సాగర్ లో 9 టీఎంసీలు నీరు నిల్వ ఉంది బ్రహ్మం సాగర్ ఆయకట్టు కింద ఉన్న రైతులకు 46 ఎకరాల పంటకు పొలాలకు నీరు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన అన్నారు. మంగళవారం ఎడమ కాలువ ద్వారా రైతులకు రోజుకు 200 క్యూసెక్కుల చొప్పున విడుదల జరుగుతుంది ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ప్రాంతీయ పశువైద్యశాల నందు సమీక్ష

**సుండుపల్లి, జూలై 21,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని ప్రాంతీయ పశువైద్యశాల నందు సుండుపల్లి మరియు వీరబల్లి మండలాల గోపాలమిత్రలు, పశుదన సహాయకులు,అనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్లు, డాక్టర్లతో సహాయ సంచాలకుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించామని డాక్టర్ విజయకుమార్ తెలియజేసాడు. ఈ సమావేశంలో సుండుపల్లి పశువైద్యశాలలో పనిచేస్తూ దుద్యాల గ్రామీణ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పదోన్నతిపై వెళ్తున్న వెంకటరమణ మరియు వీరబల్లి మండలం సోమవారం గ్రామానికి జూనియర్ వెటర్నరీఆఫీసర్గా పదోన్నతి పై వచ్చిన సురేష్, మరియు వీరబల్లి చిన్నమండెం లకు పరస్పర డిప్యూటేషన్ లో పనిచేస్తున్న డాక్టర్ భాస్కర్ మరియు డాక్టర్ గణేష్ లకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.



# ఉపాధ్యాయ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 21, ప్రభాతవార్త**
జిల్లా ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జీవీఎస్ శివ ప్రసాద్‌కు యుటిఎఫ్ ప్రొద్దుటూరు ప్రాంతీయ నాయకత్వం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రొద్దుటూరు డివిజన్ లోని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఉపవిద్యా శాఖాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులను సమన్వయ పరుచుకుని సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సివి రమణ,యస్ ఫయాజుద్దీన్, యన్ కంబగిరి దువ్వూరు మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ పాల్గొన్నారు.



# వాహనాల తనిఖీ

**దువ్వూరు, జూలై 21, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన జాతీయ రహదారి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అలాగే మురళి నగర్ మెట్ట వద్ద మంగళవారం ఎస్ఐ ధనుంజయుడు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వాహనాదారులు తమ వాహనానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులను గమనించి నడపాలి అన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు జరిమానాలు విధించారు.

